# జమీల్యా



చింగీజ్ ఐత్‌మాతోవ్

# జమీల్యా

చింగీజ్ ఐత్‌మాతొవ్

తెలుగు : పుష్పల లక్ష్మణరావు

హైదరాబాద్ బుక్ ట్రస్టు


| | | |
|---|---|---|
| ధర | : | రూ. 40/- |
| తొలి ముద్రణ | : | Jamilya, 1958 |
| తొలి ముద్రణ | : | 1971, ప్రగతి ప్రచురణాలయం, మాస్కో |
| HBT ప్రథమ ముద్రణ | : | సెప్టెంబర్, 2008 |
| కవర్ డిజైన్ | : | రమణజీవి |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067 ఫోన్ : 23521849, 23517401 |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్-28 ఫోన్: 23391364, 23304194 |

ఒక అనామక ప్రాంతంలో.. అత్యంత అనామకంగా పుట్టిపెరిగి.. కేవలం తన రచనల ద్వారానే విశ్వవ్యాప్త ఖ్యాతినొందుతూ.. తనతో పాటు ప్రపంచపటం మీద తన దేశానికీ ఒక గుర్తింపు తెచ్చిన అరుదైన మేటి రచయిత చింగీజ్ ఐత్‌మాతొవ్. అందుకే ఒక దేశంగా 'కిర్గిస్తాన్' ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఈ ప్రపంచమూ ఆయనను ఎన్నటికీ మర్చిపోలేదు. దాదాపు అర్థశతాబ్దం క్రితంనాటి జమీల్యా, తొలి ఉపాధ్యాయుడు, తల్లి భూదేవి వంటి రచనలు 150 ప్రపంచ భాషల్లోకి అనువాదమవటమే కాదు.. ఇప్పటికీ వన్నె తగ్గకుండా సమకాలీన రచనల్లా అలరిస్తుండటానికి ఐత్‌మాతొవ్ స్పృశించిన సార్వజనీన, మానవీయ భావనలే కారణం. తరతరాలుగా సామూహిక జన జీవనంలో అంతర్భాగమైపోయిన సంప్రదాయాలను కాలదన్నకుండా, వాటిని చిన్నచూపు చూడకుండానే.. ఆధునికతను అక్కునజేర్చుకునే దెలాగో అత్యంత ఆమోదయోగ్యంగా చర్చించటమే ఐత్‌మాతొవ్ రచనలకున్న ప్రధాన బలం. ఆ మార్పునూ, ఆ సామాజిక సర్దుబాటునూ తన రచనల్లోకి ఒడిసిపట్టటంలో ఆయన చూపిన ప్రతిభ అనన్యం. ఆయన కిర్గజ్, రష్యన్ భాషలు రెంటిలోనే రాసినా అనువాదాల రూపంలో వాటిని యావత్ ప్రపంచం హృదయాలకు హత్తుకుంది. యునెస్కో అంచనా ప్రకారం అత్యధికంగా చదవబడే సమకాలీన రచయితల్లో ఐత్‌మాతొవ్ పేరు కూడా ఉండటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేవలం ఓ కమ్యూనిస్టు రచయితగా మిగిలిపోకుండా అన్ని రకాల భావజాలాలకు చెందిన ప్రజలూ ఆయనను గుండెల్లో



పెట్టుకుంటున్నారంటే అందుకు కారణం..? ఒక్కసారి ఆయన జీవితాన్నీ సామాజిక పునాదులను కుదిపేసిన ఆ కాలాన్నీ తరచి చూడాల్సిందే.

మధ్య ఆసియాలో.. రష్యా సామ్రాజ్యపు పొలిమేరల్లో.. అదీ చైనాకు దగ్గరగా ఉండే కిర్గిజ్ ప్రాంతంలో 'షేకెర్' అనే కుగ్రామంలో 1928 డిసెంబరు 12న ఓ ముస్లిం గిరిజన సంచార కుటుంబంలో పుట్టారు ఐత్‌మాతొవ్. తల్లి నగిమా, తండ్రి తొరెకుల్ ఐత్‌మాతొవ్ లిద్దరూ కమ్యూనిస్టు కార్యకర్తలే. చిన్నతనంలో ఐత్‌మాతొవ్ మీద నానమ్మ బలమైన ముద్రవేసింది. పండుగలు, పెళ్ళిళ్లు, అంత్యక్రియల వంటి వాటన్నింటికీ తీసుకువెళ్ళి అతనికి అనాదిగా వస్తున్న కిర్గిజ్ ఆచారాలను, సంప్రదాయాలను పరిచయం చేసింది. గాయకులు, కథకులు, జానపదులు వంటి వారందరి దగ్గరకూ తీసుకెళ్ళి గిరిజన సంచార సంస్కృతినీ ఎరుక పరచింది. మరోవైపు తల్లి రష్యన్ సాహిత్యాన్నీ, సంస్కృతినీ దగ్గరచేసింది. ఈ రెండింటి కవితాత్మకమైన కలబోతే ఐత్‌మాతొవ్ సాహిత్యానికి ప్రధాన భూమిక.

కిర్గిస్తాన్.. సోవియట్ రష్యాలో ఒక కీలకమైన రిపబ్లిక్‌గా ఆవిర్భవించిన క్రమానికి, ఆ కాలానికి ఐత్‌మాతొవ్ ప్రత్యక్ష సాక్షి. కిర్గిజ్ తొలితరం కమ్యూనిస్టుల్లో ఒకరైన ఐత్‌మాతొవ్ తండ్రిని 'బూర్జువా జాతీయ భావాలు' ఉన్నాయన్న ఆరోపణలపై 1937లో అరెస్టుచేసి స్టాలినిస్టు శుద్ధీకరణల్లో భాగంగా అంతం చేశారు. అప్పటికి ఐత్‌మాతొవ్ వయస్సు సరిగ్గా తొమ్మిదేళ్ళు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో వాళ్ళ గ్రామం నుంచి స్త్రీలు, పిల్లలు, వృద్ధులను వదలిపెట్టి మగవారి నందరినీ యుద్ధంలోకి తరలించారు. దీంతో పద్నాలుగు ఏళ్ళు వచ్చే సరికే చదువు మానేసి కుటుంబ పోషణ కోసం ఐత్‌మాతొవ్ రకరకాల ఉద్యోగాలు చెయ్యాల్సి వచ్చింది. రష్యన్ భాష నేర్చినవాడు కావటంతో

అతడిని గ్రామ కౌన్సిల్ కార్యదర్శిగా నియమించారు. గ్రామం రిజిస్ట్రార్‌గా, పోస్ట్‌మ్యాన్‌గా ఐత్‌మాతొవ్ ఎన్నో గడ్డు అనుభవాలను ఎదుర్కొన్నాడు. "యుద్ధభూమి నుంచి వచ్చే ఉత్తరాలను చూస్తే నాకు వెన్నులోంచి వణుకు పుట్టేది. ఫలానా వ్యక్తి వీరమరణం పొందాడంటూ వచ్చే ఆ ఉత్తరాలను తీసుకుని బంధువుల వద్దకు వెళ్లి వివరించి ఓదార్చి రావటం నేనెన్నటికీ మరవలేని పాఠం" అనేవారు ఐత్‌మాతొవ్. తర్వాత ఆయన ప్రావ్దా పత్రికకు సంచార విలేఖరిగా వార్తలందించటం, పత్తి బేళ్ళు తూచటం, పశులను కాయటం, గోధుమ పండించటం, పన్నులు వసూలు చెయ్యటం వంటి ఎన్నో పనులు చేశాడు. పన్నుల తనిఖీలకు వెళ్ళినప్పుడు కొందరు రైతులు తమ ఇంట్లో వస్తువులన్నింటినీ తెచ్చి అతని ముందు పోసేవారు. ఇవన్నీ కూడా చిన్న వయసులోనే ప్రజల జీవితాలతో అతనికి సామీప్యాన్నీ, సాన్నిహిత్యాన్నీ పెంచాయి. అతని భవిష్యత్ కాల్పనిక సాహిత్యానికి దిశానిర్దేశనం చేశాయి.

పశుసంవర్ధక విభాగంలో పనిచేస్తూనే ఆయన మాస్కోలోని 'గోర్కీ లిటరేచర్ ఇనిస్టిట్యూట్'లో సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. దీనిలో భాగంగా 1958లో ప్రచురించిన జమీల్యా.. రచయితగా ఆయనకు విశిష్టమైన గుర్తింపునూ, ఎన్నో పురస్కారాలనూ తెచ్చిపెట్టింది. లూయీ ఆరగాన్ దాన్ని ఫ్రెంచ్‌లోకి అనువదిస్తూ 'ప్రపంచంలోనే అతి సుందరమైన ప్రేమకథ'గా ప్రస్తుతించాడు. ఈ అనువాదంతో సోవియట్ ఎల్లలు దాటి యావత్ ప్రపంచం ఐత్‌మాతొవ్ ప్రతిభను గుర్తించటం ఆరంభించింది. తర్వాత రాసిన 'ద ఫస్ట్ టీచర్ (1962)' (తెలుగులో తొలి ఉపాధ్యాయుడు), 'టేల్స్ ఆఫ్ ద మౌంటెన్స్ అండ్ స్టెప్స్ (1963), 'ఫేర్‌వెల్, గైలుసారే (1966)' వంటివన్నీ రచయితగా ఆయనను ఎంతో ఎత్తుకు తీసుకువెళితే మరోవైపు ఆయన రాజకీ



యంగా కూడా మరింత శక్తిమంతంగా ఎదిగారు. 63లో సాహిత్యానికి ఇచ్చే 'లెనిన్ ప్రైజ్', ఆ తర్వాత 'హీరో ఆఫ్ ద సోషలిస్ట్ లేబర్' వంటి పురస్కారాలెన్నో అందుకున్నారు. 89లో ఆయన సోవియట్ రష్యా 'కాంగ్రెస్ ఆఫ్ ద పీపుల్స్ డిప్యూటీస్' సభ్యులయ్యారు. శాశ్వత పార్ల మెంటరీ కమిషన్ అధినేత అయ్యారు. చివరికి గోర్బచేవ్ అధ్యక్ష మండలి సభ్యుడిగా నియమితులై, గోర్బచెవ్‌కు అత్యంత సన్నిహితుడిగా, సలహాదారుగా మెలిగారు. పెరిస్ట్రోయికాను బలంగా ముందుకు తెచ్చారు. 1991లో కిర్గిస్తాన్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఆయన ఎన్నో ఐరోపా దేశాలకు కిర్గిజ్ రాయబారిగా వ్యవహరించారు. తుర్కీయ భాషా దేశాలన్నీ ఆయన పేరును నొబెల్ సాహితీ పురస్కారానికి ప్రతి పాదించేందుకు కృషిచేస్తుండగా ఇంతలోనే ఐత్‌మాతొవ్ కన్ను మూయటం విషాదం. ఆయన ఎన్నో రచనలు కిర్గిస్తాన్, రష్యా, టర్కీల్లో విజయవంతమైన చలనచిత్రాలుగా కూడా రూపుదిద్దుకున్నాయి. ఆయన జీవితంపై ఓ డాక్యుమెంటరీ, అదే సమయంలో సామాజిక పరిణామాలపై వ్యాఖ్యానంగా 80లలో ఆయన రాసిన సైన్స్‌ఫిక్షన్ నవల 'ద డే లాస్ట్స్ మోర్ దాన్ 100 ఇయర్స్'ను సినిమాగా చిత్రీకరి స్తుండగా ఆ సెట్స్‌లోనే ఆయన అస్వస్థులయ్యారు. 2008 జూన్ 10న.. తన 79వ ఏట జర్మనీలోని న్యూరెంబర్గ్‌లో తుదిశ్వాస విడిచారు. 'ప్రపంచస్థాయి ప్రాధాన్యమున్న రచయితలను కోల్పోయామని' గోర్బచేవ్‌తో సహా పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కేవలం యాభై లక్షల మంది జనాభాతో కొండలు గుట్టల మయంగా ఉండే కిర్గిస్తాన్ ప్రతినిధిగా రచనా వ్యాసంగాన్ని ఆరంభించిన ఆయన.. ఆధునికతకూ, సంప్రదాయాలకూ మధ్య తలెత్తే వైరుధ్యాలు, ఒత్తిళ్ళను ఒడిసిపడుతూ తన జాతి అంతరాత్మను హృద్యంగా అక్షరీక

రించారు. కిర్గిజ్ గిరిజన సంస్కృతికీ, మరోవైపు అప్పుడప్పుడే వేళ్ళూను కుంటున్న సరికొత్త సోవియట్ సామాజిక వ్యవస్థకూ మధ్య సంక్షుభిత మైన జనజీవితాలు ఐత్‌మాతొవ్ రచనలనిండా జవజీవాలతో పలక రిస్తుంటాయి. అందుకే ఆయన రచనల్లో పైకి అసాధారణమైన సున్ని తత్వం, కవితాత్మకత ఉట్టిపడుతూనే అంతఃప్రవంతిగా సమకాలీన దృక్పథమూ వెల్లివిరుస్తుంటుంది. కిర్గిజ్ జానపదాలనూ, ఆ మౌఖిక సంప్రదాయాన్నీ సమకాలీన దృక్కోణం నుంచి పునఃసృష్టి చెయ్యటం ఆయన రచనలకున్న పెద్దబలం. వీటిలో కనిపించే మరో ముఖ్యమైన అంశం - సంప్రదాయ మధ్య ఆసియా సమాజంలో నెలకొన్న స్త్రీ పురుష అసమానత్వాలు. తొలినాళ్ళలో సోవియట్ ప్రభంజనంలో నానాటికీ కనుమరుగైపోతున్న మధ్య ఆసియా గుర్తింపు, జీవితాల గురించి విస్తృతంగా రాసిన ఆయన సోవియట్ యూనియన్ పతనానంతరం తిరిగి ఆయా దేశాలు ప్రపంచ యవనిక మీద తమదైన ముద్రతో స్వతంత్రంగా నిలదొక్కుకోవటంలోనూ ముఖ్య భూమిక పోషించారు. కిర్గిజ్ రాయబారిగా చివరినాళ్ళలో ఆయన ఎక్కువ సమయం ఐరోపాలోనే గడిపినా తన జాతి స్వరాన్నీ, అంత రాత్మనూ అక్కడ బలంగా వినిపించారు. ఐత్‌మాతొవ్‌కు ప్రజలన్నా, వాళ్ళు చెప్పేది వినటమన్నా ప్రాణం. రచయిత తన అంతరాత్మను ఆవిష్కరించటం కంటే కూడా తన సమాజం అంతరాత్మగా ప్రతి ధ్వనించటమే ముఖ్యమన్న గోర్కీ మాటలనుఆయన శిరసావహించారు. ఒక రచయిత నిబద్ధతకు... ఎటువంటి భేషజాలూ లేకుండా మార్పును ఆహ్వానించటం, ఆవిష్కరించటమే నిజమైన కొలమానమని వ్యాఖ్యానించేవారాయన. అందుకే ఆయన సోవియట్ వాస్తవికతలోని చీకటి కోణాలనూ నిష్కర్షగా, తన రచనల్లో ఆలోచనాత్మకంగా ప్రతిబింబించారు. ఈ లోపాలు రాజకీయ వ్యవస్థ లోనివి కావంటూ,



స్వాభావికంగా మానవ నైజంలో భాగమైన వీటిని చక్కదిద్దాల్సిన బాధ్యత వ్యవస్థదేనని వాదించేవారాయన.

'కిర్గిజ్ జాతిపిత'గా పేరొందిన ఆయన రచనలను ''మా దేశంలో ప్రతి కుటుంబం చదువుతుంది. మళ్ళీ మళ్ళీ చదువుతుంది. ఎందుకంటే మాకు గుండె ధైర్యాన్ని నూరిపోసింది ఆయన రచనలే. కేవలం ఒక వ్యక్తిగా మనం ఎంత మార్పు తేవచ్చో చూపారాయన'' అంటారు కిర్గిజ్ మానవ హక్కుల కార్యకర్త నటాలియా అబ్లోవా. కళాత్మకమైన దార్శనికతతో ఎంత సాధించవచ్చో, దానికున్న శక్తి సామ ర్థ్యాలేమిటో నిరూపించిన రచయిత ఐత్‌మాతొవ్. ఈ ప్రపంచానికి ఆయన పరిచయం చేసింది ఓ అనామకమైన ప్రాంతాన్నీ, అక్కడి జీవితాలనే కాదు.. ప్రేమ, శాంతి, సమానత్వాల సాధన దిశగా విశ్వ మానవాళి ముందున్న ఉమ్మడి సవాళ్ళేమిటో కూడా బలంగా అభి వ్యక్తీకరించారాయన!

## జమీల్యా

జమీల్యా ఓ అపురూపమైన ప్రేమకథ. తరచూ దీన్ని 'ప్రపంచం లోనే బహు సుందరమైన ప్రేమకథగా' అభివర్ణించినా.. అంతకు మించిన బలీయమైన సామాజిక సందర్భం, సంస్కృతుల సంఘర్షణ, సమకాలీన జీవన సంక్లిష్టతలను ప్రతిఫలించటం దీని గాఢతను మరింత పెంచింది. అందుకే ఇప్పటికీ ఐత్‌మాతొవ్ రచనలన్నింటిలోకీ ఇది అత్యంత ప్రాచుర్యం పొందిన నవలగా నిలబడుతోంది. దీన్ని ఆయన 1958లో కిర్గిజ్, రష్యన్ భాషలు రెంటిలోనూ రాశారు. 59లో లూయి

ఆరగాన్ చేసిన ఫ్రెంచ్ అనువాదంతో జమీల్యా యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. తర్వాత ఎన్నో భాషల్లోకి అనువాదమైంది.

తొలినాళ్ళలో ఈ నవల కిర్గిస్తాన్‌లో ఎన్నో ప్రకంపనలు సృష్టించింది. పురుషాధిక్య, సంప్రదాయ ముస్లిం కిర్గిజ్ సమాజం.. మరో పురుషుడి కోసం జమీల్యా భర్తను విడిచి వెళ్ళిపోవటాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేకపోయింది. 1920లలో మధ్యఆసియా దేశాల్లోకి రాజకీయ ప్రవేశం చేసిన సోవియట్ యూనియన్ స్థానిక కళలను ప్రోత్సహిస్తూనే విద్యను, ముఖ్యంగా ఆడపిల్లల చదువుకు గట్టి ప్రోత్సాహాన్నిచ్చింది. పారిశ్రామికీకరణ కూడా వేగంగా ఊపందుకోవటంతో పూర్తిగా కిర్గిజ్ స్వరూపమే మారిపోయింది. జమీల్యాకు బలమైన భూమిక అందించిన సందర్భం ఇదే! స్త్రీలు సంప్రదాయాలను ఛేధించుకుని జీవితానికి కొత్తబాటలు వేసుకునేందుకు సహకరించిన సందర్భమిది.

సామాజికంగా సరికొత్త విలువలు, వ్యవస్థలు పాదుకొల్పుకుంటున్న సంధి దశలో కిర్గిస్తాన్ ఎదుర్కొన్న జాతీయ, సాంఘిక, సైద్ధాంతిక సంఘర్షణలకు అద్దం పడుతుందీ రచన. ఒకవైపు కుటుంబ పరువు ప్రతిష్ఠలు, జాతి గౌరవం వంటి తరతరాలుగా వస్తున్న కిర్గిజ్ గిరిజన సంప్రదాయాలు. మరోవైపు సోషలిస్టు భావజాలం తీసుకువస్తున్న సరికొత్త ఆలోచనా భావధారల మధ్య జనజీవితాలు మానసికంగా ఎంతో సంఘర్షణకు లోనయ్యాయి. కుటుంబ వ్యవస్థ పెద్ద కుదుపుకు లోనైంది. స్కూళ్ళు, ఫ్యామిలీ కోర్టులు, లైబ్రరీల వంటివి ప్రవేశపెట్ట టంతో ప్రజలను కొత్త ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేశాయిగానీ కట్టు బాట్లను ఛేదించుకోవటం అంత తేలిక కాలేదు. ఈ సాంప్రదాయిక సమాజానికి ప్రతినిధి జమీల్యా భర్త. స్త్రీగా ఆమె



పట్ల ప్రేమ చూపటం కంటే కూడా.. ఆమెను తన ఆస్తిలా, సొత్తులా భావిస్తాడాయన. అందుకే దనియార్ దగ్గర తనకు కాల్సిన ప్రేమ దొరికినప్పుడు ఆమె వెనుదిరిగి చూడదు. దనియార్ నుంచి ఆమెకు ప్రత్యేకమైన భరోసా ఏదీ అవసరం ఉండదు. అంతిమంగా వారిద్దరి పయనం.. సాంప్ర దాయిక బంధనాల నుంచి స్వేచ్ఛనే కాదు, సరికొత్త సోవియట్ జాతి, సోవియట్ జీవిత నిర్మాణానికీ ప్రతీకగా నిలుస్తుంది. పెను మార్పు కోసం ఆలపిస్తున్న సమూహ గీతంతో శృతి కలుపుతుంది.

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

సాదా చట్రంలో వున్న ఈ చిన్న పెయింటింగుముందు మళ్లీ నించున్నాను. రేప్పొద్దున్న బయల్దేరి మా గ్రామం వెళ్లాల్సుంది, మరి ఈ పెయింటింగుకేసి అలా తేరిచూస్తూ యెంతోసేపు నించున్నాను — అది చల్లని వీడ్కోలు మాటలు చెబుతుందేమో విందాం అన్నట్టుగా.

ఈ పెయింటింగుని ఇంతవరకూ నేను యే ఎగ్జిబిషనులోనూ ప్రదర్శించలేదు. అంతేకాదు, మా గ్రామం నుంచి బంధువులు నన్ను చూడ్డానికని వచ్చినప్పుడల్లా ఇది దూరంనుంచైనా సరే వాళ్ల కళ్లబడకుండా వుండేటట్టు చూస్తాను. ఇదొక గొప్ప కళాఖండమేమీ కాకపోయినా, సిగ్గు పడవలసినదేమీ లేదు దీంట్లో. ఇది సాదా చిత్రం; దీనిలో చిత్రించిన నేల యెంత సాదాగా వుందో ఇది అంత సాదాగానూ వుంది.

చిత్రం పూర్వరంగం— వాడిపోయిన శరదాకాశపు టంచు. దూరాన్నున్న కొండవరుస మీద నుంచి పరుగులు తీస్తున్న ధూసరవర్ణపు పిల్లమబ్బులను వెంటతరుముతూంది గాలి. చిత్రం ఉత్తరరంగం — ఎఱ్ఱని వరమ్‌వుడ్ మొక్కలతో నిండిన స్టెప్ మైదానమూ, ఇటీవలి వానలకి తడిసి యింకా చెమ్మ ఆరని నల్లని రోడ్డు. రోడ్డు అంచులవెంట చెదురుమదురుగా మొలుస్తున్నాయి ముళ్లగడ్డి తుప్పలు. వానకి కొట్టుకుపోయిన బండిచాళ్ల పక్కన ఇద్దరు బాటసారుల అడుగుజాడలున్నాయి. దారి సాగుతూన్న కొద్దీ అవి మరింత లీలగా వున్నాయి, ఆ బాటసారులు మరొక్క అడుగు ముందుకు వేశారంటే, ఇక చట్రంవెనక్కి అదృశ్యమైపోతారన్నమాటే. వాళ్లలో ఒకరు... కాని ఆఖరి సంగతులు ముందే చెప్పేస్తున్నానేమిటి?

కథ మొదలైన రోజుల్లో నేనింకా బాగా కుర్రవాణ్ణే, అది యుద్ధం మూడో యేడాది. ఎక్కడో అతి దూరాన కూర్స్క్, ఒరేల్ నగరాల దగ్గర మా తండ్రులూ అన్నలూ యుద్ధంచేస్తున్నారు, మరి మేం, అప్పటికింకా పదిహేనేళ్ల ప్రాయంలోనే వున్న కుర్రవాళ్లం, సమష్టి క్షేత్రంలో పనిచేస్తూండేవారం. కష్టమైన దైనందినపు పొలంపని మా లేతబుజాలమీద పడింది. కోతలరోజుల్లో ఇహ మాకు మరీ కష్టమనిపించిపోయేది. కొన్ని వారాల పాటు మేం ఇంటికి కూడా రాకుండా అహర్నిశలూ పొలంలోనో, కళ్లంలోనో, లేదా రైల్వేస్టేషనుకి గింజలు తోలుకెళ్తూనో కాలం గడిపేవాళ్లం.

కోతవేడికి కొడవళ్లు నిప్పుల్లా కాల్తూన్నట్టే అనిపించుతూ ఎండ బాగా పేల్చేస్తూండిన అలాంటి రోజుల్లో ఓ దినాన, నేను ఖాళీ బండిని రైలుస్టేషను నుంచి తోలుకెళ్తూ, ఇహ ఆ రోజుకి ఇంటికెళ్లిపోవడానికే నిశ్చయించుకున్నాను.

పాటిరేవు దగ్గర దిబ్బమీద ఎక్కడైతే వీధి ఆఖరైపోతుందో అక్కడున్నాయి. పచ్చియిటిక ప్రహరీ వున్న రెండు యిళ్లు. ఇళ్ల చుట్టూ పొడుగాటి పోప్లర్‌చెట్లున్నాయి. ఇవి మా యిళ్లు. ఆ రెండిళ్లల్లోనూ మా రెండు కుటుంబాలూ ఇరుగుపొరుగులుగా ఎన్నో సంవత్సరాలై కాపురం చేస్తున్నాయి. నేను 'పెద్దింటి' కుర్రాణ్ణి, నాకు ఇద్దరు అన్నలున్నారు. వాళ్లకింకా పెళ్లికాలేదు. ఇద్దరూ యుద్ధానికెళ్లారు. అప్పుడే ఎన్ని నెలలయో వాళ్లిద్దరి గురించి ఏ కబురూ తెలియడంలేదు.

మా నాన్న ముసలాయన, వడ్రంగి. ఆయన ప్రొద్దున్నే నమాజ్ చేసుకుని, ఉమ్మడి ముంగిట వున్న వడ్రంగపు షెడ్డులోకి వెళ్లిపోతాడు పనిచేసుకునేందుకని. సాయంకాలం బాగా పొద్దుపోయాక ఇంటికొస్తాడు.

మా అమ్మా, మా చెల్లాయీ ఇంట్లో వుంటారు.



పొరుగింట్లో — మా గ్రామంలో వాళ్లందరూ ఆ యింటిని "చిన్న యిల్లు" అంటారు — మా దగ్గరబంధువుల కాపురం. మా ముత్తాతలో, మా ముత్తాత తండ్రులో సయాం అన్నదమ్ములు. అయితేనేం, మేం ఒక్క కుటుంబంలాగే వుంటున్నాం, అందుకనే వాళ్లని మా దగ్గరబంధువులని అన్నాను. మా తాతముత్తాతలు సంచారకులుగా జీవించుతూండిన రోజుల్లో కూడా, వాళ్లు సమష్టిగానే పాత మకాములు ఎత్తేసి, సమష్టిగానే పశువుల్ని కొత్తచోట్లకి తోలుకెళ్లేవారు. ఈ సంప్రదాయాన్ని మేమూ నిలబెట్టాం. సమష్టి వ్యవసాయ పద్ధతి మా గ్రామానికి వచ్చినప్పుడు మా నాన్నా, వాళ్ల నాన్నా ఇరుగుపొరుగున ఇళ్లు కట్టుకున్నారు. అక్కడ ఇళ్లు కట్టుకున్నది ఒక్క మా రెండు కుటుంబాలే కాదు, వూరి యీ చివర నుంచి ఆ చివర ఏటివొడ్డు వరకూ వున్న అరాల్‌స్కయ వీధి పొడుగునా వున్న ఇళ్లన్నీ మా తెగ వాళ్లవే, ఆ యిళ్లవాళ్లందరం ఒక్క వంశీయులమే.

సమష్టి వ్యవసాయక్షేత్రం ఏర్పడిన తరవాత, మరికొద్ది కాలానికే 'చిన్న యింటి' యజమాని చనిపోయాడు. ఆ కుటుంబంలో ఇక మిగిలినవారు అతని భార్య, ఇద్దరు కొడుకులూ. కొడుకులు బాగా చిన్నవాళ్లు. అప్పట్లో మా గ్రామంలో ఇంకా పాటించబడు తూన్న కులాచారం ప్రకారం, కొడుకులున్న వితంతువు తెగను విడిచిపెట్టి వెళ్లిపోవడానికి వీల్లేదు. అందుకని మా తెగవారు ఆవిడని మా నాన్నకిచ్చి పెళ్లిచేశారు. పితృదేవతల సమక్షంలో ఆచరించాల్సిన విధి ప్రకారం ఆయనకి తప్పిందికాదిది. చనిపోయిన వ్యక్తికి అందరికంటే దగ్గరబంధువు ఆయనే.

ఈ విధంగా మాకు మరొక కుటుంబం సంక్రమించింది. 'చిన్న యిల్లు' - ఆ యిల్లూ వాకిలీ, గొడ్డూ గోదా — దానిమట్టుకది ఒక స్వతంత్ర సంసారంకిందే లెక్క. కాని నిజానికి మేమందరం కలిసే వుండేవారం.

'చిన్న యిల్లు' కూడా తన వంతు ఇద్దరు కొడుకుల్నీ యుద్ధానికి పంపించింది. పెద్దవాడు సాదిక్ పెళ్లిచేసుకున్న కొద్దిరోజులకే సైన్యంలోకి వెళ్లిపోయాడు. వాళ్ల దగ్గర నుంచి మాకు వుత్తరాలు వస్తూండేవి, నిజానికి వుత్తరానికీ వుత్తరానికీ మధ్య ఎన్నో రోజులు గడిచిపోయేవి.

'చిన్న యింట్లో' యిద్దరే వుండేవారు: ఆ యింటావిడా – ఆవిణ్ణి 'పిన్ని' అని పిలిచేవాణ్ణి – ఆవిడ కోడలూ. వాళ్లిద్దరూ పొద్దు పొడిచినది మొదలు పొద్దుగూకేవరకూ సమష్టి క్షేత్రంలో పనిచేసేవారు. మా పిన్ని చాలా మంచిది, ఉపకారస్తురాలు, బహు నెమ్మదైన మనిషి. పనిలో, కాలువలు తీయడంలో అయితేయేమి, పొలానికి నీరు పెట్టడంలో అయితేయేమి, తనకంటె చిన్నవాళ్లతో సమానంగా వుండేదే కాని ఎన్నడూ వెనకుండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే, రెండు చేతులతోనూ పార దృఢంగా పట్టుకునేది. ఆవిడ గుణాలకి మెప్పుకోలుగా అన్నట్టు, ఆవిడ అదృష్టం కొద్దీ ఆవిడకి కష్టపడి పనిచేసే కోడలు లభించింది. అలుపు అనకుండా కష్టపడడంలో అయితేనేమి, పనితనంలో అయితేనేమి జమీల్యా ఏవిధంగానూ అత్తగారికి తీసిపోదు, కాని జమీల్యా స్వభావంమాత్రం వేరు.

జమీల్యా అంటే నాకు అతి ఇష్టం. మరి నేనంటే ఆమెకీ ఇష్టమే. మేమిద్దరం చాలాస్నేహంగా వుండేవారం. కాని ఒకరినొకరం పేరుపెట్టి పిల్చుకునేందుకు మాత్రం మాకు ధైర్యం లేకపోయింది. వేరే కుటుంబం వాళ్లం అయివుంటే నేనామెని తప్పకుండా జమీల్యా అనే పిలిచి వుండేవాణ్ణి. కాని అన్నగారి భార్యని వరసపెట్టి పిలువవలసినట్టు, నే నామెను 'వదినె' అని పిలిచేవాణ్ణి. ఆమె కూడా నన్ను 'చిట్టిమరిది' అని పిలిచేది, నేను అంత చిట్టిపిల్లాణ్ణి కాకపోయినప్పటికిన్నీ. అసలు మా యిద్దరికీ వయస్సులో ఏమంత



తేడా లేదు కూడా. అయితేయేం, పెనిమిటి తమ్ముళ్లని యింటి కోడలు 'చిట్టిమరిది' అనీ, లేదా 'చిట్టీ' అనీ పిలవడం మా గ్రామంలో ఆనవాయితీ.

రెండిళ్ల సంసారమూ మా అమ్మే చక్కబెట్టేది. ఆమెకి మా చెల్లాయి సాయంచేసేది. జుట్టు ఎన్నో జడలుకింద అల్లుకుని, చూసేవారికే నవ్వొచ్చే చిన్నపిల్ల చెల్లాయి. ఆ గడ్డు రోజుల్లో అది ఎంత కష్టపడి పనిచేసేదో నేనెన్నటికీ మరచిపోలేను. రెండిళ్ల మేకపిల్లల్నీ, ఆవుదూడల్నీ పెరటితోట లావలకి మేపుకొచ్చేందుకు తీసుకెళ్లేదీ అదే. ఇంట్లో పొయ్యిలోకి ఎప్పుడూ కొరత లేకండా వుండేందుకని యెండు పేడ, చిదుగులూ పోగుచేసుకొచ్చేదీ అదే. యుద్ధంలో తప్పిపోయిన తనయిద్దరి కొడుకుల గురించీ మనోవ్యాధితో బాధపడు తూన్న అమ్మ వొంటరిపాటుకు వెలుగిచ్చేదీ అదే – మా చప్పిడి ముక్కు చెల్లాయే.

మా పెద్దకుటుంబంలో ఎల్లప్పుడూ సామరస్యం సమృద్ధి వుండినందుకు మా అమ్మనే చెప్పుకోవాలి. రెండిళ్ల సంసారాలకీ ఆవిడే సంపూర్ణాధికారంగల యజమాని, ఆవిడే నట్టింట దీపం. సంచారకులుగానే వుండిన మా తాతల కుటుంబంలో ముక్కు పచ్చలారని కోడలిపడుచుగా ఆమె అడుగు పెట్టింది. అటుతర్వాత వారి స్మృతులను పవిత్రంగా ఎంచుకుంటూ కుటుంబాలను న్యాయంగా పాలించుతూండేది. ఆమెకున్న అత్యంత చిత్తశుద్ధీ, ధర్మనిరతీ, విజ్ఞతతోకూడిన అనుభవమూ కారణంగా ఆమెకి మా గ్రామంలో ఎంతో పేరుండేది. ఇంట్లో పెత్తనం అంతా అమ్మదే. నిజం చెప్పాల్సొస్తే, నాన్నని గ్రామస్థులు కుటుంబ యజమానిగా గుర్తించే వారు కారు. ఎవరైనా పనిమీద మా యింటికి రానున్నప్పుడు, వాళ్లతో లోకులు ఇలా అనడం నే ననేక సార్లు విన్నాను: "ఇదిగో, నువ్వు 'ఉస్తాక్'

**End of Preview.**

**Rest of the book can be read**

**@ [http://kinige.com/kbook.php?id=731](http://kinige.com/kbook.php?id=731)**

* * *